వామ్మో.. వాంబే?!

- భీమా మైదాన్‌లో శిథిలావస్థకు ఇళ్లు
- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు, గోడలు, స్టేర్‌గేజి
- ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికుల ఆందోళన
- కాలనీవాసులకు టౌన్‌ప్లానింగ్ నోటీసులు
- ఇళ్లను ఖాళీ చేస్తే మూడేళ్లలోపు ఇళ్లను నిర్మిస్తాం
- నమ్మకం లేక అయోమయంలో లబ్ధిదారులు


కవాడిగూడ భీమా మైదాన్ వాంబే కాలనీ


బయటి నుంచి శిథిలావస్థకు చేరిన వాంబే కాలనీ భవనం

కవాడిగూడ, మే 29(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల ఉదాసీనత, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వరదబాధితుల కోసం భీమామైదాన్‌లో నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకొని, ప్రమాదకరంగా మారాయి. వాంబే ఇళ్లు నిర్మించి కనీసం 20 సంవత్సరాలు కూడా పూర్తికాకముందే శిథిలావస్థకు చేరడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో వరదలు వచ్చిన సమయంలో ఇళ్లు కోల్పోయిన, ఇళ్లు లేని వారికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాంబే పథకం కింద మొత్తం 496 ఇళ్లను నిర్మించారు. కేంద్రంలో బీజేపీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వరద బాధితులతో పాటు ఇళ్లు లేని వారి కోసం భీమామైదాన్‌లో వాంబే పథకం కింద 496 ఇళ్లను నిర్మాంచారు. అయితే ఆ ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరకున్నాయని రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముషీరాబాద్ నియోజకవర్గం టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా వాంబే కాలనీలో ఉన్న 496 మంది లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు. కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాల పాటు సమయం తీసుకొని వారికి నూతన ఇళ్లను నిర్మిస్తామని, ఇక్కడి ప్రజలకు ప్రత్యామ్నాయంగా నివాసం ఉండేందుకు ఇళ్లను చూపిస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారులు హామీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయంగా తాము చూపించే ప్రాంతాలకు వెళ్లాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు సూచనలు చేస్తున్నారు.

- గత అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఉదాసీన వైఖరితో ఎక్కడో ఒక చోట స్లాబ్ పడిపోవడం, స్టేర్‌కేస్ కూలిపోవడం జరుగుతోందని వారు పేర్కొన్నారు. అయితే ఇందుకు భిన్నంగా తమకు సమీప స్థలాల్లోనే నివాసం ఉండేందుకు ఏర్పాట్లు చేసి, నిర్మాణాలు చేపట్టాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు. బస్తీలో ఉన్న వారంతా రోజువారీ కూలీలేనని, దీంతో పాటు మహిళలు ఇళ్లలో పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఇళ్లలో చాలా మంది స్లాబ్‌లకు రిపేర్లు చేయిస్తున్నా కొన్ని రోజులకే కూలిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల స్కూల్, కాలేజీ చదువులు సమీప ప్రాంతాల్లోనే ఉన్నాయని వీటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉన్నఫలంగా నోటీసులు ఇచ్చి తమ ఇళ్లను ఖాళీ చేయాలని కోరితే చేసే ప్రసక్తే లేదని వారు పేర్కొంటున్నారు.



దగ్గరగా ఉంటేనే అంగీకరిస్తాం

అనేక సంవత్సరాలుగా వివిధ బస్తీల్లో నివాసం ఉంటున్న తమకు వరదలు వచ్చిన సమయంలో నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాంబే పథకం కింద ఇళ్లను నిర్మించి అందజేశాయని నివాసితులు తెలిపారు. తమను సిటీకి దూరంగా కాకుండా దగ్గరగా పునరావాస కేంద్రాలు చూపిస్తే అంగీకరిస్తామని చెబుతున్నారు. భీమామైదాన్‌లో ఉన్న మెజార్టీ ప్రజలు టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్ణయాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు.

- ఇళ్ల నిర్మాణ సమయంలో అధికారులు, కాంట్రాక్టర్లు శ్రద్ధ తీసుకోకుండా నామమాత్రంగా ఇళ్లను నిర్మించి నేడు శిథిలావస్థకు చేరాయని, మిగతా ప్రాంతాలకు తరలివెళితే మీ వాంబే ఇళ్లను డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడం దారుణంగా ఉందని పేర్కొంటున్నారు దీనివల్ల తమ ఉపాధి దెబ్బతింటుందని, తమ కుటుంబ పోషణ చాలా కష్టంగా మారే పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇళ్లు నిర్మిస్తారా? పెండిగ్ పెడతారా?

టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణయ్య, టౌన్ ప్లానింగ్ సిబ్బంది జగన్, అనిల్, రాజయ్య మిగతా సిబ్బంది గురువారం ఇంటింటికీ తిరిగి భీమామైదాన్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు నోటీసులు జారీచేశారు. మూడు సంవత్సరాల్లో 'మీకు నూతన ఇళ్లను నిర్మించి ఇస్తాం. మేం పంపించిన స్థలాలకు వెళ్లాలి' అని అధికారులు లబ్దిదారులకు సూచించారు. దీంతో ఇళ్లను ఖాళీ చేసిన తరువాత తమ స్థలంలో తమకే ఇళ్లను నిర్మించి ఇస్తారా లేక పెండింగ్‌లో పెడతారా అని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు అన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.


వాంబే కాలనీ ఇళ్లను ఖాళీ చేయాలని లబ్దిదారులకు నోటీసులు అందజేస్తున్న టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి కృష్ణయ్య సిబ్బంది

ప్రత్యామ్నాయం చూపితేనే ఖాళీ చేస్తాం



భీమామైదాన్‌లో మొత్తం 496 ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ నివసించే వారంతా రోజువారీ కూలీలే. పనికి వెళితే కానీ పూటగడవదు. బస్తీవాసుల పిల్లల చదువులు, జీవనపాధి పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో ఉన్నఫలంగా ఇళ్లను ఖాళీచేయాలని ఆదేశాలు జారీచేస్తూ నోటీసులు ఇస్తే ఎలా? సమీప ప్రాంతాల్లో ప్రత్యామ్నాయం చూపించలి. లేకపోతే ఇక్కడ నుంచి ఇళ్లను ఖాళీచేసే ప్రసక్తే లేదు.

\- కె.శంకర్, భీమామైదాన్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉన్నఫలంగా ఎక్కడకు వెళ్లాలి



గతంలో తాము గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్‌లో 30 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివసించాం. 50 సంవత్సరాలుగా తాము ఇక్కడే ఉంటూ కూలి చేసుకుంటూ నివసిస్తున్నాం. ఉన్నఫలంగా ఖాళీ చేయాలని చెబితే తమ కుటుంబ సభ్యులు ఎక్కడికెళ్లాలి. ప్రభుత్వం ఆలోచించి తమకు న్యాయం చేయాలి

\- మణెమ్మ భీమా మైదాన్ కాలనీ వాసి

స్థానికంగా ఇళ్లను చూపించాలి



భీమామైదాన్ వాంబేకాలనీలో 18 సంవత్సరాలుగా ఉంటున్నాం. అధికారులు ఉన్నఫలంగా ఇళ్లను ఖాళీచేసి వెళ్లిపోవాలంటే ఎక్కడకు వెళ్లాలి. నోటీసులు ఇవ్వడం కాదు. స్థానికంగా తమకు ఉపాధి దొరికే విధంగా ఇళ్లను చూపించాలి. అప్పటివరకు ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదు. ఇళ్ల నిర్మాణం పేరుతో సంవత్సరాలు గడిస్తే తాము ఎక్కడ ఉండాలి.

\- జంగమ్మ, వాంబే కాలనీ నివాసి

నీటి పంపిణీలో కేంద్రం జోక్యం చేసుకోవాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

బర్కత్‌పుర, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి, కృష్ణా నదుల నీటి పంపిణీలో కేంద్రం జోక్యం చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. నీటి పంపిణీలో తెలంగాణకు నాటి నుంచి నేటి వరకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గత కేసీఆర్, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు వీటిపై పూర్తిస్థాయిలో స్పందించడం లేదని ఆరోపించారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బచావత్ ట్రిబ్యూనల్, బ్రిజేష్ ట్రిబ్యూనల్‌కు వ్యతిరేకంగా తెలంగాణకు నీటిపంపకంలో వాటా ఇవ్వకుండా ఏపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత వైఎస్ జగన్, ప్రస్తుత చంద్రబాబు అదే ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. సముద్రంలో కలిసే నీటిని మాత్రమే తాము వినియోగించుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడడం సరైంది కాదన్నారు. గోదావరి, కృష్ణా నది జలాలను అధికంగా వాడుకుని మరచిపోయి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది నాగుల శ్రీనివాస్‌యాదవ్, బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, సుధాకర్ ముదిరాజ్, ఉదయ్‌నేత, నందగోపాల్, జోషి, మోతిలాల్, గేయగోపి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మికులను సన్మానిస్తున్న గౌతమ్‌రావు

చేనేత కార్మికులకు బీజేపీ నేతల సన్మానం

అంబర్‌పేట, మే 29 (ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ అంబర్‌పేట డివిజన్ నేతల ఆధ్వర్యంలో చేనేత కార్మికులను గురువారం సత్కరించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో నరేంద్రనగర్ కమ్యూనిటీహాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు మాట్లాడుతూ చేనేత కార్మికులకు బీజేపీ అన్ని రకాలుగా సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్, దాసోజు నాగభూషణంచారి, మైలరాంరాజు, రాంచందర్ గుప్తా, కృష్ణముదిరాజ్, భిక్షపతి, దయాకర్‌యాదవ్; భాస్కర్‌గౌడ్, వర్కాల శ్రీకాంత్, పద్మశాలీ సంఘం నేతలు వనం రమేష్, గట్టయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ పూజారి వీడ్కోలు సభ రేపు

చిక్కడపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయం ఉప ప్రధాన అర్చకులు కాశీనాథశర్మ పదవీ విరమణ వీడ్కోలు సభను శనివారం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో కె.లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడారు. లక్ష్మీగణపతి ఆలయంలో అర్చకునిగా పనిచేసి ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కాశీనాథశర్మను సత్కరిస్తామని పేర్కొన్నారు.

మున్నూరుకాపులకు సముచితస్థానం కల్పించాలి

చిక్కడపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం త్వరలో జరిపే మంత్రివర్గ విస్తరణలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ మున్నూరుకాపు యువజనసంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.దశరథం కోరారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మొదటిసారిగా మున్నూరుకాపులకు చోటు లేని మంత్రివర్గం ఏర్పడిందన్నారు. కాబట్టి ఇప్పుడు జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్, ప్రధానకార్యదర్శి మహేందర్, రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, నాయకులు అభిషేక్, అశోక్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


వర్షాకాలం స్పెషల్ డ్రైవ్‌లో మట్టికుప్పల తొలగింపును పరిశీలిస్తున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి తదితరులు

వర్షపునీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో వర్షపునీరు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని ఆజామాబాద్, వీఎస్టీ రోడ్, ఆర్టీసీ బస్‌భవన్ ప్రధాన రహదారులలో రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన మట్టికుప్పల తొలగింపు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం గురువారం జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు భారీగా పడుతున్న నేపథ్యంలో మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌ను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వినోద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ, బీజేపీ నాయకులు ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● అహల్యాబాయికి నివాళి



నింబోలిఅడ్డ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం అహల్యాబాయి హోల్కర్ జయంతిని నిర్వహించారు. పొదుపుగ్రూపు సంఘాలతో కలిసి నిర్వహించిన ఈ వేడుకల్లో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కిలారి మనోహర్, అనంతలక్ష్మి, జ్యోతి, లావణ్య, శాంతాబాయి, వరలక్ష్మి, అరవింద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

\- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

రిటైర్డ్ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి మృతి


చకిలం రంగారావు (ఫైల్)

నల్లకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రంగారావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఇతర ప్రముఖులతో కలిసి భువనగిరి జిల్లాలోని మృతుడి నివాసానికి వెళ్లి రంగారావు భౌతికకాయానికి నివాళులర్పించారు. చకిలం రంగారావు మృతి బ్రాహ్మణ సంఘాలకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి రంగారావు, కానాల శ్యాంసుందర్‌రావు, కె.శంకర్‌రావు, కె.సతీష్, గూడ జయరాం, నాగేందర్ రావు, ప్రసాద్, లక్ష్మి నరసింహరావు, సి.రంగారావు, దేవులపల్లి వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కమ్యూనిటీ హాల్‌లో రాజకీయ నేత తిష్ట!


- రెండేళ్లు గడచినా ఖాళీ చేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న బస్తీవాసులు


సంజయ్‌గాంధీనగర్ బస్తీ కమ్యూనిటీహాల్

నల్లకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం కోసం జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీహాళ్లు పలు చోట్ల ఆయా బస్తీ అధ్యక్షులు, పలువురు రాజకీయ నేతలు వ్యాపారంగా మార్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ కమ్యూనిటీహాల్‌లో చిన్నచిన్న శుభకార్యాలు నిర్వహిస్తే డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్ బస్తీలో రెండేళ్లుగా ఓ రాజకీయ నేత కుటుంబం నివాసం ఉంటోంది. సదరు నేత ఇంటి నిర్మాణం పేరుతో రెండేళ్లుగా అతని కుటుంబం కమ్యూనిటీహాల్‌లో తిష్ట వేసింది. బస్తీలో ఇంటి నిర్మాణానికి మూడు, నాలుగు నెలల వెసులుబాటు కోసం కమ్యూనిటీహాల్ నివాసం కల్పిస్తారు కానీ ఈ బస్తీలో మాత్రం రెండేళ్లుగా సదరు కుటుంబం నివాసం కొనసాగుతోంది. దీంతో ఆ బస్తీ ప్రజలు చిన్నచిన్న శుభకార్యాలకు చిన్నపాటి వీధిలో నిర్వహించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో బస్తీలోని కొందరు అతని అడగలేకపోతున్నారు. అయితే ఆ నేత జీహెచ్ఎంసీ, ప్రజాప్రతినిధులకు తగు సహకారం అందిస్తూ ఈ కమ్యూనిటీహాల్‌లో రెండేళ్లుగా యదేచ్ఛగా నివసిస్తున్నారు. ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఆ కమ్యూనిటీహాల్ లో నివాసం ఉంటున్న కుటుంబాన్ని ఖాళీ చేయించాలని పలువురు కోరుతున్నారు. బోనాలు, ఇతర పండగలు ప్రారంభమవుతుండడంతో ఈ కమ్యూనిటీహాల్‌లో ఏదైనా కార్యక్రమం ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందని వారు కోరుతున్నారు. సదరు నేత నుంచి కిరాయి డబ్బులు వసూలు చేసి, అవి కమ్యూనిటీహాల్ అభివృద్ధికి ఖర్చుచేయాలని వారు కోరుతున్నారు.

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్


మాట్లాడుతున్న చిక్కడపల్లి ఏసీపీ ఎన్.రమేష్‌కుమార్, వేదికపై రాంబాబు, రాజునాయక్, ఎస్ఐ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని, జీవ వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని చిక్కడపల్లి ఏసీపీ ఎన్.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎద్దుల ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టు చేయవద్దని సూచించారు. గురువారం ముషీరాబాద్ పీఎస్ సీఐ జి.రాంబాబు అధ్యక్షతన నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ముషీరాబాద్ పీఎస్ పరిధిలో బక్రీద్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ జూన్ 7న జరిగే బక్రీద్ పండగను ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేసి, జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలో వేయాలి తప్ప రోడ్లపై వేయవద్దని సూచించారు. పండగ సందర్భంగా ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీయకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఎద్దులను తీసుకొచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి పీఎస్ సీఐ రాజునాయక్, ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పీస్ కమిటీ, మైనారిటీ నాయకులు అక్తర్‌అలీ, షరీఫ్ హుస్సేన్, ఎండీ.మోహిన్, అక్లక్ హుస్సేన్, ఎజాజ్ హుస్సేన్, మసూద్, జావేద్‌ఖాన్, మహ్మద్‌గౌస్, ముతావలి నజీర్‌అలీ, శంకర్‌గౌడ్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి: కాచిగూడ ఏసీపీ

అంబర్‌పేట/బర్కత్‌పుర, మే 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కాచిగూడ ఏసీపీ వై.హరీష్‌కుమార్ అన్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని కాచిగూడ డివిజన్‌లోని అంబర్‌పేట, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పీస్ కమిటీ సభ్యులతో గురువారం అంబర్‌పేట మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవడానికి పీస్ కమిటీ సభ్యులు సహకరించాలని సూచించారు. ఎలాంటి పుకార్లను నమ్మవద్దని ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మసీదుల వద్ద పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సీఐ టి.కిరణ్‌కుమార్, కాచిగూడ పీఎస్ హెచ్‌ఓ జ్యోత్స్న, డీఐ రఘు, ఎస్ఐలు రవికుమార్, సుభాష్, విజయ్, మౌనిక, తరుణ్, నరేష్, పోలీసు సిబ్బంది, పీస్ కమిటీల సభ్యులు శరత్‌శ్యామ్, కన్నె రమేష్‌యాదవ్, అమర్‌నాథ్, మహ్మద్ గౌస్, షాకీర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను వధించొద్దు


ఏసీపీ యాదగిరికి వినతిపత్రం ఇస్తున్న శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండగ సందర్భంగా గోవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ ఏసీపీ యాదగిరికు గురువారం శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సుదర్శన్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోకి గోవులను రాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గణేష్, రాష్ట్ర నాయకుడు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దోమలగూడ పీఎస్ సీఐకి కూడా వారు వినతి పత్రం సమర్పించారు.

ఎమ్మెల్యే వివేక్‌పై గజ్జెల కాంతం ఆరోపణ విడ్డూరం


మాట్లాడుతున్న బల్వంతరావు, శ్రీధర్‌రావు

నల్లకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై గజ్జెల కాంతం ఆరోపణలు విడ్డూరం అని, మనువాదుల తొత్తుగా గజ్జెల కాంతం వ్యవహరిస్తున్నారని జై భీమ్ సేన, నేషనల్ అంబేడ్కర్ సేన నేతలు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కీలక భూమిక పోషించిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబంపై గజ్జెల కాంతం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గురువారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జై భీమ్ సేన ఫైట్‌ఫర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు, నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంఘాలు, ప్రజల కోసం పోరాటం చేయాలి తప్ప మనువాదుల తొత్తుగా గజ్జెల కాంతం వ్యాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, కాంగ్రెస్‌పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన గడ్డం కుటుంబంపై ఏనాడు ప్రజాసమస్యలపై గళం విప్పని సదరు వ్యక్తి పార్టీకి నమ్మకద్రోహం అంటూ వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. గడ్డం వివేక్ కుటుంబంపై అనుచితంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేన నాయకులు గిరి, కల్యాణ్ పాల్గొన్నారు.

జూన్ 1న ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బీపీ, షుగర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కె.వీరయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం పక్కన హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యాలయంలో ఈ శిబిరం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9949821177, 9490098662 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కేసీఆర్‌కు అండగా ఉండాలి


మాట్లాడుతున్న సుధాకర్

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన కేసీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు అండగా ఉండాలని తెలంగాణ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ కో-చైర్మన్, 1969 ఉద్యమకారుడు ఉప్పు సుధాకర్ కోరారు. గురువారం విద్యానగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్‌కే బాసటగా నిలువనున్నారని పేర్కొన్నారు.


ఫణీందర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ

సెంట్రల్ మెడిసిన్స్ స్టోర్స్‌లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్

నల్లకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సెంట్రల్ మెడిసిన్స్ స్టోర్స్‌లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్‌ను నియమించడానికి కృషి చేస్తామని టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.ఫణీందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫణీందర్‌రెడ్డిని నగరంలోని కార్యాలయంలో కలిశారు. ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యలపై ఎండీకి వినతిపత్రం సమర్పించారు. తమ వినతి పత్రంపై ఎండీ సానుకూలంగా స్పందించారని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ ఆఫీసర్స్ పండుగ సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఫణీందర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కౌటిల్య, జనరల్ మేనేజర్ రుక్మారెడ్డిని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, కోశాధికారి జి.యాదయ్య, కార్యదర్శి దేవంభట్ల ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీశైలం, అలీ, మహిళా నాయకులు మాధవి, రాధిక, ఆలేఖ్య తదితరులు పాల్గొన్నారు.